

# మన దునియా

Our News Our World

RNI Number
TELTEL/2023/85680

మన అక్షరం - మన ప్రపంచం



రిపోర్టర్లు కావలెను

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

తెలుగు రాష్ట్రాలలో సంచలనం సృష్టిస్తున్న మన దునియా మీకు సరైన వేదిక.. అన్ని జిల్లాలు, మండలాలు మరియు నియోజకవర్గాల పరిధిలో పనిచేయుటకు అవకాశం కల్పిస్తోంది. రిపోర్టర్లు కావాలి.

సంప్రదించుటకు అవకాశం...
9490056011,9603969335



సంపుటి : 4 | సంచిక : 4 | సెప్టెంబర్ 10 గురువారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-





# సమస్యల వలయంలో బాలుర హాస్టల్..!

## మల్లంపల్లి–ఎటునాగారం హాస్టల్‌లో ఇదంతా జరుగుతున్నా ఉన్నతాధికారులు ఎందుకు స్పందించడం లేదు?



**మన దునియా,మల్లంపల్లి--ఎటునాగారం:సెప్టెంబర్ 09**

మల్లంపల్లి--ఎటునాగారం విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన వసతి, పౌష్టికాహారం, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాల్సిన బాలుర హాస్టల్ సమస్యల వలయంలో చిక్కుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. హాస్టల్‌లోని పరిస్థితులపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా సంబంధిత ఉన్నతాధికారులు ఎందుకు స్పందించడం లేదనే సందేహాలు తలెత్తుతున్నాయి.

**మెనూ ప్రకారం ఆహారం అందుతోందా?**

ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాల్సి ఉన్నప్పటికీ, మెనూకు అనుగుణంగా ఆహారం అందడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. విద్యార్థులకు అందుతున్న ఆహారంపై అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నారా? నాణ్యతను పరిశీలిస్తున్నారా? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

**శుభ్రత లేని వంటగది.. నాసిరకం కూరగాయలు?**

విద్యార్థులకు భోజనం తయారు చేసే వంటగదిలో పరిశుభ్రత ప్రమాణాలు పాటించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా నాసిరకం కూరగాయలను వినియోగిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. విద్యార్థుల ఆరోగ్యంతో ముడిపడిన అంశంపై సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించారా?

**గ్యాస్ ఉండగా కట్టెలపైనే వంట ఎందుకు?**

వంటకు గ్యాస్ సదుపాయం ఉన్నప్పటికీ కట్టెలపై వంట చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసలు కట్టెలపై వంట చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? గ్యాస్ సదుపాయం సక్రమంగా వినియోగిస్తున్నారా? దీనిపై అధికారులు దృష్టి

(మిగతా 2వ పేజీలో..)

## ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్ర.. కేసీఆర్‌పై అసెంబ్లీలో రేవంత్ ఆరోపణలు

స్పీకర్‌ను దూషించడంపై రేవంత్ ఆగ్రహం

ప్రజాసమస్యలపై చర్చకు ప్రభుత్వం సిద్ధమని వెల్లడి

బీఆర్ఎస్ సభ్యులను ఉసిగొలిపారని విమర్శ

స్పీకర్‌కు కేసీఆర్ క్షమాపణ చెప్పలేదని వ్యాఖ్య

అసెంబ్లీ స్పీకర్‌ను దూషించిన ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. స్పీకర్‌పై మాటల దాడికి పాల్పడటం పార్లమెంట్, ముంబయి, పుల్వామా దాడులతో సమానమని వ్యాఖ్యానించారు. ప్రజాసమస్యలపై చర్చ జరగకుండా అడ్డుకునేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్రకు తెరతీశారని ఆరోపించారు. శాసనసభలో బుధవారం మాట్లాడిన సీఎం.. స్పీకర్ స్థానాన్ని, ఆయన తల్లిని అవమానించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. స్పీకర్‌ను దూషించిన ఘటనను సభ్యులంతా ముక్తకంఠంతో ఖండించారని తెలిపారు. ఇలాంటి ఘటన

(మిగతా 2వ పేజీలో..)



## విజయ్ కూటమికి కొత్త పేరు.. 'సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ అలయన్స్'

తమిళనాడు సీఎం విజయ్ కూటమికి కొత్త పేరు ఖరారు

కూటమి చైర్‌పర్సన్‌గా వ్యవహరించనున్న సీఎం విజయ్

సమన్వయ సమావేశానికి దూరంగా వామపక్ష పార్టీలు

తమిళనాడు ముఖ్యమంత్రి, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ నేతృత్వంలోని అధికారిక కూటమికి నూతన పేరు ఖరారైంది. ఈ కూటమికి "సెక్యులర్ సోషల్ జస్టిస్



(మిగతా 2వ పేజీలో..)

## కాంగ్రెస్ ఎవరి చావునూ కోరుకోదు..

కేసీఆర్ వందేళ్లు ఆరోగ్యంగా ఉండాలి: మంత్రి శ్రీధర్‌బాబు

**మన దునియా, హైదరాబాద్: సెప్టెంబర్ 09**

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆరోగ్యంగా ఉండాలని,



(మిగతా 2వ పేజీలో..)

## శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్...!!

హరీశ్‌రావు, కేటీఆర్‌తో సహా 22 మంది..!!

మన దునియా,హైదరాబాద్:సెప్టెంబర్ 09

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై శాసనసభలో సస్పెన్షన్ వేటు పడింది. దీంతో ఈ సమావేశాలకు మొత్తంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దూరంగా ఉండనున్నారు. శాసనసభ సజావుగా కొనసాగకుండా అడ్డుకుంటున్న బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్‌కు శ్రీధర్‌బాబు సిఫారసు చేయగా, స్పీకర్ అనుమతిస్తూ వేటు వేశారు. శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, అనిల్ జాదవ్, కౌశిక్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, కోవా లక్ష్మి, మాణిక్‌రావు, చింతా ప్రభాకర్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, విజేయుడు, కె.సంజయ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, కేపీ వివేకానంద లపై సస్పెన్షన్ వేటు పడింది. సస్పెన్షన్ వేటు వేస్తున్నట్లు ప్రకటన.. మూడో రోజు సభ ప్రారంభమైన వెంటనే 'వి వాంట్ జస్టిస్' అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు శాసన సభా కార్యకలాపాలకు అడ్డు తగిలారు. పెద్ద ఎత్తున నినాదాలు

(మిగతా 2వ పేజీలో..)



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

# కాంగ్రెస్ ఎవరి చావునూ కోరుకోదు..

ఆయన వందేళ్లకు పైగా బతికుండాలనే తాము మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని రాష్ట్ర ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నడూ ఎవరి చావునూ కోరుకునే సంస్కృతి కాదని ఆయన తేల్చి చెప్పారు. తెలంగాణ రాష్ట్రానికి కేసీఆర్ అనుభవంతో కూడిన మార్గదర్శకత్వంలో ప్రజాసేవ కొనసాగాలని తాము ఆకాంక్షిస్తున్నామని పేర్కొన్నారు. చట్టసభల్లో ప్రజాసమస్యలపై చర్చించేందుకు నిబంధనలు ఉంటాయని, బీఆర్ఎస్ సభ్యులు లేవనెత్తాలనుకుంటున్న అంశాలను సభా నిబంధనావళి ప్రకారం సరైన రూపంలో స్పీకర్‌కు లిఖితపూర్వకంగా సమర్పించాలని ఆయన హితవు పలికారుచట్టసభల హుందాతనాన్ని కాపాడటంలో ఎలాంటి రాజీ ఉండదని, శాసనసభ ప్రాంగణంలో, సభ లోపల అసభ్యకరమైన పదజాలం వాడటం, అభ్యంతరకరంగా ప్రవర్తించడాన్ని ఏమాత్రం ఆమోదించే ప్రసక్తే లేదని మంత్రి శ్రీధర్‌బాబు హెచ్చరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నియమ నిబంధనలకు అందరూ కట్టుబడి ఉండాలని, స్పీకర్ స్థానాన్ని గౌరవిస్తూ సభా కార్యకలాపాలు సజావుగా సాగేందుకు సహకరించాలని కోరారు. ప్రతిపక్షం నిర్మాణాత్మకమైన సలహాలు, సూచనలతో ప్రజల పక్షాన నిలబడాలే తప్ప, వివాదాలు సృష్టిస్తూ ప్రజా సమస్యలను పక్కదారి పట్టించడం సరికాదని ఆయన స్పష్టం చేశారు

# విజయ్ కూటమికి కొత్త పేరు.. 'సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ అలయన్స్'

(మొదటి పేజీ తరువాయి)

విక్టరీ అలయన్స్" (ఎస్ఎస్‌జేవీఏ)గా నామకరణం చేశారు. చెన్నై పనైయూర్‌లోని టీవీకే ప్రధాన కార్యాలయంలో ముఖ్యమంత్రి విజయ్ అధ్యక్షతన జరిగిన భాగస్వామ్య పక్షాల సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ నూతన కూటమికి విజయ్ ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించనున్నారు.2026 అసెంబ్లీ ఎన్నికల అనంతరం ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత జరిగిన రెండో అతిపెద్ద సమావేశం ఇది. ఈ భేటీలో టీవీకే, కాంగ్రెస్, విడుతలై చిరుత్తైగల్ కట్చి (వీసీకే), మరుమలార్చి ద్రవిడ మున్నేట్ర కళగం (ఎండీఎంకే), ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) పార్టీల అగ్రనేతలు పాల్గొన్నారు. అయితే, ప్రభుత్వానికి వెలుపల నుంచి మద్దతు తెలుపుతున్న సీపీఐ, సీపీఎం పార్టీల ప్రతినిధులు మాత్రం ఈ సమావేశానికి హాజరుకాలేదు.రాబోయే రోజుల్లో తమిళనాడు, పుదుచ్చేరిలో జరగనున్న ఉపఎన్నికల్లో సమష్టిగా పోటీ చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. మధురాంతకం, ధరాపురం వంటి నియోజకవర్గాలకు అభ్యర్థుల పేర్లను త్వరలోనే ప్రకటించే అవకాశముంది. కూటమి విధివిధానాలు, ఉమ్మడి కనీస కార్యక్రమం, స్టీరింగ్ కమిటీ ఏర్పాటు వంటి కీలక అంశాలపై కూడా విస్తృతంగా చర్చించినట్లు తెలుస్తోంది. లౌకికవాదం, సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తూనే, విజయ్ పేరు స్ఫురించేలా "విక్టరీ" అనే పదాన్ని కూటమి పేరులో చేర్చడం గమనార్హం. ఈ కూటమి ద్వారా రాష్ట్ర రాజకీయాల్లో డీఎంకే, అన్నాడీఎంకేలకు దీటైన ప్రత్యామ్నాయంగా, మూడో ప్రధాన శక్తిగా ఎదగాలని విజయ్ వర్గం లక్ష్యంగా పెట్టుకుంది.

# ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్ర.. కేసీఆర్‌పై అసెంబ్లీలో రేవంత్ ఆరోపణలు

(మొదటి పేజీ తరువాయి)

తర్వాత కేసీఆర్ స్వయంగా స్పీకర్‌తో మాట్లాడి క్షమాపణలు చెబుతారని ప్రజాస్వామ్యవాదులు భావించారని అన్నారు. కానీ కేసీఆర్ అలా చేయలేదని విమర్శించారు.ప్రజాసమస్యలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ సమస్యలు చర్చకు వస్తే తమ గుట్టు రట్టవుతుందనే భయంతోనే ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ కుట్రకు తెరతీశారని ఆరోపించారు. బీఆర్ఎస్ సభ్యులను ఉసిగొలిపి సభకు పంపించారని మండిపడ్డారు. ఎక్కడైతే ఈ కుట్రకు తెరలేచిందని ఆరోపించారో.. అదే ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు వెళ్లి డప్పులు వాయించేందుకు ప్రయత్నిస్తే అక్కడ శుద్ధీకరణ చేశారని రేవంత్ అన్నారు. ఉత్తరాఖండ్‌లో ఖర్గే నిరసనలో పాల్గొన్న మైదానాన్ని శ్రీరామసేన శుద్ధీకరణ చేసిందని గుర్తుచేశారు. ఇలాంటి దురదృష్టకర ఘటన తెలంగాణలోనూ చోటుచేసుకుందని వ్యాఖ్యానించారు. స్పీకర్ స్థానాన్ని అవమానించడం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని సీఎం పేర్కొన్నారు. సభలో సభ్యులు బాధ్యతగా వ్యవహరించాలని, ప్రజాసమస్యలపై చర్చకు సహకరించాలని కోరారు.



# శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్...!!

(మొదటి పేజీ తరువాయి)

చేస్తూ సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగించారు. దీంతో వారిని సభ నుంచి సస్పెండ్ చేయాలని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రతిపాదించారు. దీంతో స్పీకర్ సస్పెన్షన్ వేటు వేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం స్పీకర్‌ను కలిసేందుకు వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను మార్షల్స్ అడ్డుకున్నారు.

**సభ సజావుగా నడిచేలా..**

సభాపతికి చేయాల్సిన అవమానాలన్నీ బీఆర్ఎస్ నేతలు చేశారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండిపడ్డారు. అవమానాలు కొనసాగించే పరిస్థితి మానుకోవాలని కోరుతున్నట్లు తెలిపారు. సభాపతి సూచన చేస్తే వాదన పెట్టుకోకుండా సభ సజావుగా నడిచేలా చూడాలన్నారు. వెల్‌లోకి వచ్చి చేయాల్సిన అవమానాలన్నీ చేసి స్పీకర్‌పై సవాల్ విసురుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మగౌరవానికి భంగం కలిగించే ప్రయత్నం చేయొద్దని కోరారు. విభజన తీసుకురావడానికి మరో ప్రయత్నం మంచిది కాదని, సభాపతితో పాటు వారి తల్లిని దూషిస్తే నిరసనలు తెలిపారని అన్నారు. న్యాయం కావాల్సింది బలహీనవర్గాలకు.. నిన్న నిరసనలో భాగంగా దళిత సంఘాలు ఎర్రవల్లిలోని రోడ్డుపై నడిస్తే అక్కడ పసుపు నీళ్లతో శుద్ధి చేశారని భట్టి విక్రమార్క ఆవేదన వ్యక్తం చేశారు. పసుపు నీటితో రోడ్డు శుద్ధి చేసి అవమానించడమే కాకుండా న్యాయం కావాలంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. న్యాయం కావాల్సింది బలహీనవర్గాలు, దళిత, గిరిజనులకని పేర్కొన్నారు. బీఆర్ఎస్ చేతుల్లో అవమానానికి గురవుతున్న పేద ప్రజలకు న్యాయం జరగాలని చెప్పారు. విపక్ష నేతల ఆగడాలు, అవమానాలను ప్రభుత్వం సంయమనంతో భరిస్తోందని చెప్పారు. రాష్ట్రాన్ని విపక్ష నేతలు ఏం చేయాలని అనుకుంటున్నారని ప్రశ్నించారు. దొరతనం పోకడలను భరించడానికి తెలంగాణ రాష్ట్రం సిద్ధంగా లేదని ఘాటుగా స్పందించారు.

# సమస్యల వలయంలో బాలుర హాస్టల్..!

(మొదటి పేజీ తరువాయి)

సారించాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

**తాగునీరు అదే.. స్నానానికి అదేనా?**

విద్యార్థులకు తాగునీరు, ఇతరత్రా అవసరాలకు సరిపడా పరిశుభ్రమైన నీటి సదుపాయం కల్పించాల్సి ఉండగా, ఒకే నీటి వనరును తాగడానికి, స్నానానికి ఉపయోగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ నీటి నాణ్యతను అధికారులు ఎప్పుడైనా పరీక్షించారా? విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు అందుతోందా?

**బాత్రూంల కొరతతో విద్యార్థుల అవస్థలు**

హాస్టల్‌లో తగినన్ని బాత్రూం సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమాచారం. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు, స్నానపు గదులు ఉన్నాయా? వాటి నిర్వహణ ఎలా ఉంది? అనే అంశాలపై ఉన్నతాధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది.

**ప్రిన్సిపల్ వివరణపై అనుమానాలెందుకు?**

హాస్టల్‌లోని సమస్యలపై ప్రిన్సిపల్‌ను వివరణ కోరితే పొంతనలేని సమాధానాలు ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. హాస్టల్ నిర్వహణపై ప్రిన్సిపల్ నుంచి ఉన్నతాధికారులు పూర్తిస్థాయి వివరణ కోరారా? సమస్యలు వాస్తవమైతే వాటిపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

# గవర్నర్‌ను కలిసిన కేటీఆర్.. కాంగ్రెస్ సర్కార్‌పై ఫిర్యాదుల వెల్లువ

- గవర్నర్‌తో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భేటీ
- 1000 రోజులు గడిచినా కాంగ్రెస్ హామీలు నెరవేర్చలేదని విమర్శ
- తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దాడులు చేశారని ఫిర్యాదు
- దాడులకు సంబంధించిన ఆధారాలను గవర్నర్‌కు అందజేత
- రైతు బంధు, నిరుద్యోగ సమస్యలపై ప్రభుత్వ వైఫల్యంపై ఆరోపణ



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోని పార్టీ ఎమ్మెల్యేల బృందం బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ అయ్యింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరిస్తోందని ఈ సందర్భంగా వారు గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. తమ పార్టీ ఎమ్మెల్యేలపై పోలీసులు దాడులకు పాల్పడ్డారని ఆరోపిస్తూ, అందుకు సంబంధించిన ఆధారాలను గవర్నర్‌కు సమర్పించారు.అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ 1,000 రోజుల పాలనకు నిరసనగా నల్ల చొక్కాలు ధరించి అసెంబ్లీకి వెళ్లిన తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దౌర్జన్యం చేశారని ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని అవమానించారని, ఈ దాడులపై కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు. దీనికి విరుద్ధంగా తమ పార్టీ నేతలపైనే అక్రమంగా కేసులు బనాయించారని ఆయన మండిపడ్డారు.వంద రోజుల్లోనే హామీలన్నీ అమలు చేస్తామని నమ్మబలికిన కాంగ్రెస్, 1,000 రోజులు గడిచినా 420కి పైగా వాగ్దానాలను గాలికొదిలేసిందని కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు కింద రూ. 73,000 కోట్లు అందిస్తే, ప్రస్తుత ప్రభుత్వం కనీసం యూరియాను కూడా సరఫరా చేయలేని దుస్థితిలో ఉందని ఎద్దేవా చేశారు. రైతు బీమాను నీరుగార్చి, నిరుద్యోగ యువతను మోసం చేస్తోందని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నెలకొన్న ఈ పరిణామాలపై తక్షణమే జోక్యం చేసుకోవాలని గవర్నర్‌ను కోరినట్లు కేటీఆర్ వివరించారు.

# కేసీఆర్ ఫాంహౌస్ వద్ద శుద్ధి.. అసెంబ్లీలో తీవ్ర దుమారం

తెలంగాణ శాసనసభ మూడో రోజు సమావేశాలు ప్రారంభం కాగానే సభలో తీవ్ర దుమారం చెలరేగింది. నిన్న సిద్దిపేట జిల్లా ఎర్రవెల్లిలోని కేసీఆర్ ఫాంహౌస్ వద్ద కాంగ్రెస్ ఎస్సీ విభాగం నేతలు, దళిత సంఘాలు నిరసన తెలిపిన అనంతరం... బీఆర్ఎస్ నేతలు ఆ ప్రాంతాన్ని శుద్ధి చేశారంటూ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సభలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితులు నిరసన తెలిపి వెళ్లిన స్థలాన్ని శుద్ధి చేయడం వెనుక బీఆర్ఎస్ నాయకుల తీవ్రమైన కులతత్వం బయటపడిందని... ఇది యావత్ దళిత సమాజ ఆత్మగౌరవాన్ని, హక్కులను తీవ్రంగా అవమానించడమేనని విమర్శించారు. దళిత సామాజిక వర్గానికి చెందిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను అసెంబ్లీ గేటు వద్ద బూతులు తిట్టిన అంశాన్ని మరిచిపోకముందే... బీఆర్ఎస్ మరోసారి దళితుల పట్ల తమకున్న వివక్షను నిరూపించుకుందని మండిపడ్డారు. ఈ శుద్ధి వ్యవహారంపై సభలో సమగ్ర చర్చ జరగాలని ఆయన పట్టుబట్టారు. మరోవైపు, మంత్రి ప్రసంగానికి అడ్డుతగులుతూ బీఆర్ఎస్ సభ్యులు వెల్‌లోకి



దూసుకొచ్చి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఆవరణలో బీఆర్ఎస్ మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై, వారిపై జరిగిన అనుచిత ప్రవర్తనపై ప్రభుత్వం తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్లకార్డులతో నినాదాలు చేశారు. ఇరువైపులా నేతల పోటాపోటీ నినాదాలు, హంగామాతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం
సెప్టెంబర్ । గురువారం । 10 । 2026



# చంద్రబాబు అక్రమ అరెస్ట్ కు నిరసనగా నాడు చిలకలూరిపేటలో జరిగిన మెరుపు ధర్నా జగన్ నే కలవరపరిచింది

- ప్రత్తిపాటి పుల్లారావు నాయకత్వంలో భారీసంఖ్యలో తరలివచ్చిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు చంద్రబాబుకు మద్ధతుగా జాతీయరహదారినే దిగ్బంధించారు.
- 2 గంటలపాటు టీడీపీ శ్రేణులు ప్రజలు చేపట్టిన ఆందోళనతో చంద్రబాబును తరలించే పోలీసుల వాహనాలు అంగుళం కూడా ముందుకు కదల్లేకపోయాయి.
- చిలకలూరిపేట టీడీపీ శ్రేణుల తెగువ, ధైర్యాన్ని స్ఫూర్తిగా తీసుకొని రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు చేపట్టిన నిరసనలతో నాటి ప్రభుత్వం గడగడలాడిపోయింది.



చిలకలూరిపేట మన దునియా డెస్క్ న్యూస్

" సెప్టెంబర్ 9 ..రాష్ట్ర చరిత్రలోనే ఎప్పటికీ మరువలేని ఒక చీకటి రోజు. దేశ రాజకీయాల్లోనే ఒక దుర్దినం. నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితంలో వెలకట్టలేని ప్రజాభిమానాన్ని సొంతం చేసుకున్న, మచ్చలేని నాయకుడైన చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేయడం ద్వారా నాటి ముఖ్యమంత్రి జగన్ తన అప్రజాస్వామిక పోకడలకు తానే బలయ్యాడు. 1000 గొడ్లను తిన్న రాబందు ఒక్క గాలివానకు నేలకూలినట్టు.. నూరు తప్పులుచేసిన శిశు పాలుడు పరమాత్ముడైన కృష్ణ భగవానుని చేతిలో హతుడైనట్టు తన నియంత్రత్వ, నిరంకుశ పాలనా విధానాలతో చివరకు జగనే పతనమైపోయాడు. 2023న నాటి దుర్మార్గపు ప్రభుత్వం ప్రజా నాయకుడు చంద్రబాబును అర్ధరాత్రి అక్రమంగా అరెస్ట్ చేసి తన గొయ్యి తానే తవ్వుకుంది. తమ అభిమాన నేత అక్రమ అరెస్టును నిరసిస్తూ నాడు చిలకలూరిపేట ప్రజలు మెరుపుధర్నాతో ఉవ్వెత్తున ఉద్యమించారు. ప్రజా నాయకుడు ప్రత్తిపాటి పుల్లారావు మార్గనిర్దేశకత్వంలో, వీరోచితంగా ముందుకు సాగారు. ఆనాడు వారు చేసిన పోరాటం. చూపిన తెగువ, ప్రదర్శించిన ధైర్య సాహసాలు ఏకంగా సీఎం స్థానంలో ఉన్న జగన్ నే కలవరపరిచాయనేది ఎప్పటికీ గుర్తుండిపోయే వాస్తవం. నిజం ఎప్పటికీ ఓడిపోదు..నిజాయితీ ఎవరికీ తలవంచదని చిలకలూరిపేట ప్రజలు తమ నిరసనలు, ఆందోళనలతో నిరూపించారు. 2 గంటలపాటు చెన్నై-కోల్ కతా జాతీయ రహదారిని దిగ్బంధించి, చంద్రబాబును తరలిస్తున్న పోలీస్ వాహనశ్రేణిని ముట్టడించారు. జగన్ కు, వైసీపీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వారు చేపట్టిన ఆందోళన నాటి కసాయి ప్రభుత్వాన్ని, వైసీపీ నాయకుల్ని వణికించింది. ఒకానొక దశలో వైసీపీ నాయకులు బయటకు రావడానికే భయపడ్డారంటే పరిస్థితి ఎంతలా అదుపుతప్పిందో అర్థంచేసుకోవచ్చు. నాడు చిలకలూరిపేట సహా రాష్ట్రంలో జరిగిన ప్రజాందోళనలు, నిరసన కార్యక్రమాలు కొన్నినెలల పాటు వైసీపీ నాయకులకు కంటిమీద కునుకు లేకుండా చేశాయి. ప్రజలిచ్చిన అధికారాన్ని తమ కక్షసాధింపులకు, స్వార్థ ప్రయోజనాలకు వాడుకున్నందునే గత ఎన్నికల్లో వైసీపీ 11 స్థానాలతో ఘోరపరాజయం పాలైంది.ఆనాడు చిలకలూరిపేటలో జరిగిన మెరుపుధర్నా స్ఫూర్తితో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ప్రజలు స్వచ్ఛందంగా రోడ్లపైకి వచ్చి చంద్రబాబుకు మద్ధతుగా నిలిచారు. జై చంద్రబాబు, జై తెలుగుదేశం, జై జై ప్రత్తిపాటి అని నాడు మార్మోగిన నినాదాలు పల్నాడు గడ్డపై పదేపదే ప్రతిధ్వనించాయి. నాటి ముఖ్యమంత్రి జగన్ అప్రజాస్వామిక, అరాచక పోకడల్ని నిరసిస్తూ, చిలకలూరిపేట నడిబొడ్డున ఒక మినీ సంగ్రామమే జరిగింది. మచ్చలేని చంద్రుడైన చంద్రబాబు రాజకీయ ప్రతిష్ఠను మంటగలపాలి.. టీడీపీని దెబ్బతీయాలన్న జగన్ నేరాలోచనలు.. ఆయన రాజకీయ జీవితాన్నే విచ్ఛిన్నం చేశాయి. వైసీపీ పతనానికే బాటలు వేశాయి. 2024 ఎన్నికల్లో జగన్ కు జీవితకాలం గుర్తుండిపోయేలా ప్రజలు రిటర్న్ గిఫ్ట్ ను అందించేలా చేశాయి." అని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు బుధవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

# కేసీఆర్ మరణాన్ని కాంగ్రెస్ ఎప్పుడూ కోరుకోలేదు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.. రేవంత్ రెడ్డి అభిమాని

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్

మా సీఎం చిత్రపటానికి పిండ ప్రధానం చేస్తే మా ఎమ్మెల్యేకు కోపం రాదా..?

కేసీఆర్ బాత్‌రూమ్‌లో జారి పడితే గ్రీన్ ఛానల్ ద్వారా సీఎం రేవంత్ రెడ్డి వైద్యం

కేసీఆర్‌కు చెడు జరగాలని ఎమ్మెల్యే హరీశ్ రావు పూజలు




మన దునియా,హైదరాబాద్:సెప్టెంబర్ 09

మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మరణాన్ని కాంగ్రెస్ ఎప్పుడూ కోరుకోలేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. కేసీఆర్‌కు చెడు జరగాలని ఎమ్మెల్యే హరీశ్ రావు పూజలు చేశారని స్వయంగా కవిత చెప్పారని అన్నారు. తాము ఏరోజూ కేసీఆర్ చెడు కోరుకోలేదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎవరి చెడునూ కోరుకోదని స్పష్టం చేశారు. కేసీఆర్ ఆరోగ్యం పట్ల వేరే ఆలోచన లేదని టీపీసీసీ చీఫ్ అన్నారు. కేసీఆర్ బాత్‌రూమ్‌లో జారి పడితే గ్రీన్ ఛానల్ ద్వారా సీఎం రేవంత్ రెడ్డి వైద్యం చేయించిన విషయం మర్చిపోయారా అని ప్రశ్నించారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చినప్పుడు ఆరోగ్యం గురించి అడిగిన సంగతి గుర్తులేదా అంటూ నిలదీశారు. కేసీఆర్ అసెంబ్లీకి రావాలని సీఎం రేవంత్ రెడ్డి మాత్రమే కోరుకుంటున్నారని తెలిపారు. ప్రతిపక్ష నేతను కాంగ్రెస్ గౌరవిస్తుందని చెప్పారు. 55 మంది సిబ్బందితో కేసీఆర్ ఫాంహౌస్ దగ్గర ప్రభుత్వం సెక్యూరిటీ పెట్టిందని మహేశ్ వెల్లడించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.. రేవంత్ రెడ్డి అభిమాని అని.. ఆ అభిమానంతోనే ఆయన అలా మాట్లాడి ఉండొచ్చన్నారు. గతంలో సీఎం రేవంత్ రెడ్డికి టిఆర్ఎస్ నాయకులు పిండం పెట్టినప్పుడు తెలీదా అని ప్రశ్నించారు. మరి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు కోపం రాదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు తీరు దళిత సమాజాన్ని అవమానించే విధంగా ఉందని మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు..

# కవితపై అనుచిత కామెంట్స్..

కానిస్టేబుల్‌పై నాన్‌బెయిలబుల్ కేసు నమోదు

మన దునియా,హైదరాబాద్:సెప్టెంబర్ 09

మహిళల గౌరవానికి భంగం కలిగించేలా ప్రవర్తించే వారిపై, ప్రత్యేకించి చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులే నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని తెలంగాణ పోలీస్ శాఖ స్పష్టం చేసింది.మాజీ ఎంపీ, టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను ఉద్దేశించి సామాజిక మాధ్యమాల్లో అత్యంత అసభ్యకరమైన, అనుచిత పోస్టులు పెట్టిన వ్యవహారంలో ఓ పోలీసు కానిస్టేబుల్‌పై పోలీస్ శాఖ తీవ్రస్థాయిలో చర్యలు చేపట్టింది. ఫిర్యాదు అందిన వెంటనే స్పందించిన ఉన్నతాధికారులు, సివిల్ సర్వీసెస్ కాండక్ట్ రూల్స్ ప్రకారం సదరు కానిస్టేబుల్ కె. అనిల్‌ను తక్షణమే విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.హైదరాబాద్ పోలీస్ కమిషనర్ నుంచి ప్రాథమిక విచారణ నివేదిక అందిన వెంటనే అంతర్గత శాఖాపరమైన విచారణ (డిపార్ట్‌మెంటల్ ఎంక్వైరీ) చేపట్టి, నిబంధనల ప్రకారం కఠిన శిక్ష విధిస్తామని ఉన్నతాధికారులు వెల్లడించారు. శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలతో పాటు కానిస్టేబుల్ అనిల్‌పై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేశారు. హైదరాబాద్ సైబర్ క్రైమ్స్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 589/2026 కింద భారతీయ న్యాయ సంహిత (BNS) సెక్షన్లు 75, 79లతో పాటు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (IT) చట్టంలోని సెక్షన్ 67 కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ప్రాథమిక విచారణలో నిందితుడు తన వ్యక్తిగత మొబైల్ ఫోన్ నుంచే ఈ అభ్యంతరకర పోస్టులను పెట్టినట్లు నిర్ధారణ కావడంతో, ఆ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ (FSL) పరీక్షల నిమిత్తం పంపించారు. మహిళలపై ఎలాంటి అసభ్య ప్రవర్తన జరిగినా కఠినంగా వ్యవహరిస్తామని, చట్ట నిబంధనల ప్రకారం తదుపరి న్యాయపరమైన చర్యలు కొనసాగుతాయని తెలంగాణ పోలీస్ శాఖ స్పష్టం చేసింది.



## నోటీసులు అందుకున్న ఓటర్లు విచారణకు హాజరుకావాలి - మున్సిపల్ కమిషనర్ పి. శ్రీహరి బాబు

చిలకలూరిపేట మన దునియా డెస్క్ న్యూస్



చిలకలూరిపేట: ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (SIR-2026) కార్యక్రమంలో భాగంగా 'నో మ్యాపింగ్' మరియు 'అనామలీస్' సమస్యలపై నోటీసులు అందుకున్న పట్టణ ఓటర్లు ఈ నెల 11వ తేదీ (11.09.2026) లోపు మున్సిపల్ కార్యాలయంలో జరిగే విచారణకు విధిగా హాజరుకావాలని సహాయ ఓటరు నమోదు అధికారి, మున్సిపల్ కమిషనర్ పి. శ్రీహరి బాబు ఒక ప్రకటనలో తెలిపారు. నోటీసులు అందుకున్న వారు తమ వెంట అవసరమైన ఆధారాలు, ధృవీకరణ పత్రాలను తీసుకువచ్చి తమ ఓటు హక్కును తుది జాబితాలో ఖాయపరచుకోవాలని సూచించారు. నోటీసులు పొంది కూడా విచారణకు హాజరుకాని వారి ఓట్లను తుది ఓటర్ల జాబితా నుండి శాశ్వతంగా తొలగిస్తామని ఆయన స్పష్టం చేశారు. దీనిపై ఏవైనా సందేహాలు లేదా ఇతర సమాచారం కోసం సంబంధిత బూత్ లెవల్ అధికారులను (బీఎల్ఓ) సంప్రదించాలని కమిషనర్ కోరారు.

## గుంటూరి అభి రామ్ పుట్టినరోజున అన్నదానం




మన దునియా,నార్కెట్ పల్లి, సెప్టెంబర్ 09



నార్కెట్ పల్లి వాస్తవ్యులు,ప్రతిరోజు 100 మంది నిరుపేదలకు అన్నంపెట్టే దయామయుడు, స్వర్గస్థులు గుంటూరి అభిరామ్ వారి పుట్టినరోజు సందర్బంగా 100 మందికి నిరుపేదలకు, నిస్సయులకు, బాటసారులకు, మనం స్వచ్ఛంద సంస్థలో 635 రోజున వారి ప్రాణ స్నేహితులు అన్నదానం జరిపించారు. ఇటీవల నవంబర్ 30 తేదిన రోడ్డు ప్రమాదంలో మరణించిన తాను, ఎల్లప్పుడూ మాతోనే ఉంటాడు అని, వారి కుటుంబనికి ఎల్లవేళలా తోడుగా ఉంటాం అని స్నేహితులు తెలిపారు. వారి తండ్రి గుంటూరి ఈశ్వర్ రావ్ మాట్లాడుతూ మా మధ్య మా కొడుకు లేకపోయినా వారి స్నేహితులు మమ్మల్ని ప్రేమగా చూసుకుటున్నారు అని తెలిపారు. ఈ కార్యక్రమం లో బైరోజు గణేష్,కంచోజు యశ్వంత్, మన్నెబోయిన నగేష్,జక్కంపూడి భార్గవ్ తేజ,ముంత జశ్వంత్,మొహమ్మద్ తౌసిఫ్,వెంపాటి సత్య సాయి,సరిపెల్లి మనోజ్,సిగ వినయ్,దుబ్బాక అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## అప్పటివరకు 'రైతుబీమా'ను అమలు చేసేందుకు నిర్ణయం!

మన దునియా,హైదరాబాద్:సెప్టెంబర్ 09



తెలంగాణ : రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ బీమా పథకం అమల్లోకి వచ్చేవరకు రైతుబీమా స్కీమ్‌ను అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు రైతు మరణాల నమోదుకు మంగళవారం పోర్టల్ తెరవగా, ఏఈవోలు చనిపోయిన రైతుల వివరాలను గతంలో మాదిరే నమోదు చేయనున్నారు. అయితే, ప్రభుత్వం ఇప్పటివరకు రెన్యువల్ ప్రీమియం చెల్లించకపోవడంతో పరిహారం ఎప్పుడు, ఎలా చెల్లిస్తుందనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

## పీఎం కిసాన్ సాయం పెంపు?.. క్లారిటీ

మన దునియా,న్యూఢిల్లీ:సెప్టెంబర్ 09



పీఎం కిసాన్ పథకం ద్వారా కేంద్రం ఏటా రూ.6 వేలు అందిస్తోన్న విషయం తెలిసిందే. అయితే ఈ సాయాన్ని రూ.10 వేలకు పెంచుతున్నట్లు జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని స్పష్టం చేసింది. రైతులకు అందించే సాయాన్ని పెంచే ప్రతిపాదనపై ప్రభుత్వం పరిశీలిస్తోందని ఇటీవల కేంద్ర హై పవర్ పర్చేజ్ కమిటీ సభ్యుడు కృష్ణవీర్ చౌదరి చెప్పారు. ఈ నేపథ్యంలో పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ఠ వేదికగా క్లారిటీ ఇచ్చింది. కాగా 24వ విడత నిధులు వచ్చేనెలలో విడుదలయ్యే అవకాశం ఉంది.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

# పోరుబాటలో ఉద్యోగులు..

## ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ స్కీమ్.. పేరు రాని వారి డబ్బులు వెనక్కి

**మన దునియా,హైదరాబాద్:సెప్టెంబర్ 09**




తెలంగాణ : ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ స్కీమ్‌లో పేరు రాని దరఖాస్తుదారులకు డిపాజిట్ల వాపసు ప్రక్రియ ప్రారంభమైంది. దరఖాస్తుదారులు చెల్లించిన రూ.10 వేల డిపాజిట్లను, వారు దరఖాస్తు సమయంలో ఉపయోగించిన ఖాతాలోనే తిరిగి జమ చేస్తున్నట్లు హౌసింగ్ బోర్డ్ వైస్ ఛైర్మన్ గౌతమ్ తెలిపారు. మీ సేవ, ఇతర ఖాతాల ద్వారా చెల్లించిన వారి విషయంలో అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. లాటరీలో ఎంపికైన వారి వివరాల పరిశీలన ప్రక్రియ కొనసాగుతోందని వెల్లడించారు.

## జనసేన పార్టీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 10న మంచిర్యాలలో భారీ ఆత్మీయ సమావేశం

**మన దునియా,సెప్టెంబర్ 09,మంచిర్యాల జిల్లా**




జనసేన పార్టీ ఆధ్వర్యంలో పెద్దపల్లి, ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల ఆత్మీయ సమావేశం సెప్టెంబర్ 10న మంచిర్యాలలోని పద్మనాయక ఫంక్షన్ హాల్లో భారీగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా “చలో మంచిర్యాల” పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని మందమర్రి స్థానిక ప్రెస్ క్లబ్‌లో జనసేన పార్టీ సీనియర్ నాయకులు ఆవుల సాగర్ ఆధ్వర్యంలో కార్యకర్తలు, అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెద్దపల్లి ఆ ఆదిలాబాద్ పార్లమెంట్ కోఆర్డినేటర్ మంతెన సంపత్ కుమార్ గారు, చెన్నూర్ నియోజకవర్గ నాయకులు జీవన్ వడ్లకొండ గారు,రాష్ట్ర అధికార ప్రతినిధి మూలా హరీష్ గౌడ్ హాజరయ్యారు.అలాగే చెన్నూర్ నియోజకవర్గ ముఖ్య నాయకులు పిట్టలా సుధాకర్ గారు,రసమల్ల రాజేష్,వాసాల అజయ్,చరణ్ ,పవన్ తదితరులు పాల్గొన్నారు.సెప్టెంబర్ 10న మంచిర్యాలలో నిర్వహించనున్న ఈ ఆత్మీయ సమావేశానికి జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

## ఉల్లాస్ మేళాలో తెలంగాణ స్టాల్ కు విశేష ప్రశంసలు.

**మన దునియా, సెప్టెంబర్ 09,మంచిర్యాల జిల్లా**

అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం సందర్భంగా జవహర్ బాల్ భవన్, న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన ఉల్లాస్ మేళా (ఉల్లాస్ మేళా - నవ భారత సాక్షరతా కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రం స్టాల్ విశేషంగా ఆకట్టుకుంది. అడిషనల్ సెక్రటరీ అర్చనా శర్మ అవస్తి ఐ.ఏ.ఎస్ తెలంగాణ రాష్ట్రం స్టాల్ ను సందర్శించి, తెలంగాణలో ఉల్లాస్ పనితీరు బాగా ఉన్నదని ప్రశంసించారు. తెలంగాణలోని లంబాడీ జానపద సంస్కృతి, స్థానిక గిరిజన సాక్షరతా కార్యకలాపాలను వీక్షించి, మహిళా వాలంటీర్లు నిర్వహిస్తున్న అక్షరాస్యత కార్యక్రమాలను అభినందించారు.సి.ఎన్.సి.ఎల్ ప్రొఫెసర్ ఉషా శర్మ మాట్లాడుతూ, ఉన్నత విద్యా విద్యార్థులను సైతం ఉల్లాస్ వాలంటీర్స్ గా తీసుకొని వారి ద్వారా అక్షరాస్యత అభివృద్ధికి కృషి చేయమని తెలిపారు. కాశిపేట మండలంలోని లంబడీ తాండాకు చెందిన వాలంటీర్ రాజేశ్వరి 312 మంది గ్రామస్థులను అక్షరాస్యులుగా చేసినందుకు గాను, అదనంగా 32 మందికి ఉచిత వృత్తి శిక్షణ కార్యక్రమంలో భాగంగా కుట్టు శిక్షణ నేర్పించినందుకు ప్రత్యేకంగా అభినందిస్తూ సక్సెస్ స్టోరీగా ఇంటర్వ్యూ తీసుకోవడం జరిగింది. తదుపరి సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా లంబాడీ నృత్య ప్రదర్శన, బతుకమ్మ, బోనాలు, పోతురాజు ప్రదర్శన మొదలైనవాటిని డిప్యూటీ డైరెక్టర్ పురుషోత్తం ఆధ్వర్యంలో డి.ఆర్.పి బండ శాంఖరి, శైలజ, రాజేశ్వరి, కవిత, జ్యోతి, భూమమ్మ, రాజు, హరి లాల్ ప్రదర్శించిన నృత్య ప్రదర్శన ఆహుతులను అలరించింది. డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మొహమ్మద్ నుమాన్ మాట్లాడుతూ, ఢిల్లీలో తెలంగాణ రాష్ట్రానికి ఉల్లాస్ ప్రాతినిధ్యం వహించడం గర్వకారణమని తెలిపారు. వివిధ రాష్ట్రాల సంస్కృతులు, సంప్రదాయాలు, విభిన్న పద్ధతులు ఈ మేళా ద్వారా వీక్షించడం వలన వారి పద్ధతులు, కార్యక్రమాలు మనం కూడా పాటించడం వలన అవుట్ పుట్ మెరుగు అవుతుందని తెలియజేశారు. రంగారెడ్డి జిల్లా డెప్యూటీ డైరెక్టర్ అనిత మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఢిల్లీలో ఉల్లాస్ సంబరాలలో ఎన్నో రాష్ట్రాల సక్సెస్ స్టోరీలు విన్న తర్వాత ఏర్పడిన ఉత్సాహంతో తెలంగాణ టీం ఉల్లాస్ కార్యక్రమంలో మరింత ఉత్సాహంగా పాల్గొంటుందని తెలిపారు.



**ఎల్బీ స్టేడియంలో మహా ధర్నా!**
**6 డీఏలు పెండింగ్‌లో..**
**పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలి**
**బకాయిలు క్లియర్ కావాలంటే..!**

**మన దునియా,హైదరాబాద్:సెప్టెంబర్ 09**




ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వ పాలనా యంత్రాంగాన్ని సమర్థవంతంగా నడిపిస్తూ, సంక్షేమ పథకాలను ప్రజల ముంగిటకు చేర్చే కీలక శక్తులు ఉద్యోగులు. అయితే, ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్యలు, దక్కాల్సిన న్యాయమైన హక్కుల సాధన కోసం ఉద్యోగ వర్గాలు నేడు పోరు బాట పట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) తమ నాలుగు ప్రధాన డిమాండ్ల సాధన కోసం దశలవారీ ఉద్యమ కార్యాచరణను ప్రకటించింది. ఇందులో భాగంగా తొలి అడుగుగా ఆగస్టు 27న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టరేట్ల ముందు ఉద్యోగులు భారీ ఎత్తున మహాధర్నాలు నిర్వహించి తమ నిరసనను వ్యక్తం చేశారు. అనంతరం, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో సెప్టెంబర్ 1న ‘పెన్షన్ విద్రోహ దినం’ సందర్భంగా మరోసారి కలెక్టరేట్ల ఎదుట ఉద్యోగులు, ఉపాధ్యాయులు ధర్నాలకు దిగారు. ఈ ఉద్యమ పరంపరలో అత్యంత కీలక ఘట్టంగా సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో భారీ మహాధర్నాకు జేఏసీ పిలుపునిచ్చింది.

6 డీఏలు పెండింగ్‌లో..

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన కరువు భత్యం వాయిదాలు వరుసగా పేరుకుపోయి ప్రస్తుతం దాదాపు 6 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ డీఏలు సకాలంలో విడుదల కాకపోవడంతో, ఉద్యోగం,ఉపాధ్యాయులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెరిగిన నిత్యావసర ధరలు, ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుంటే, పీఆర్సీ ఆలస్యం కారణంగా క్యాడర్‌ను బట్టి సగటున ఒక్కో ఉద్యోగి నెలకు ?10,000 నుండి ?25,000 వరకు నష్టపోతున్నారు. ఈ సుదీర్ఘ నిరీక్షణ వల్ల మొత్తంగా ప్రతి ఉద్యోగికి ఇప్పటివరకు దాదాపు ?3 లక్షల నుంచి ?5 లక్షల రూపాయలకు పైగా ఆర్థిక నష్టం వాటిల్లింది. ఈ జాప్యం వారి కుటుంబ ఆర్థిక ప్రణాళికలను తీవ్రంగా దెబ్బతీస్తోంది.

పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలి

కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఉద్యోగుల చిరకాల ఆకాంక్ష అయిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని స్పష్టమైన వాగ్దానం చేసింది. అయితే ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు గడిచినా ఆ కీలక హామీ నేటికీ అమలుకు నోచుకోకపోవడం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాది ఉద్యోగులు, ఉపాధ్యాయులలో తీవ్ర నిరాశను, అభద్రతాభావాన్ని కలిగిస్తోంది. ఉద్యోగ విరమణ తర్వాత ప్రశాంత జీవితాన్ని, సామాజిక భద్రతను అందించే ఏకైక మార్గం పాత పెన్షన్ విధానమే. ఉద్యోగుల సేవలను గుర్తించి, ఎన్నికల వేళ ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రభుత్వం ఇప్పటికైనా సానుకూలంగా స్పందించాలి. సీపీఎస్‌ను తక్షణమే రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించడం ద్వారా ఉద్యోగ వర్గాలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి.

బకాయిలు క్లియర్ కావాలంటే..!

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ సిబ్బందికి సంబంధించి జీపీఎఫ్ , సరెండర్ లీవులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, గ్రాట్యుటీ తదితర రూపాల్లో దాదాపు ?10,000 కోట్ల నుంచి ?16,000 కోట్ల మేర బిల్లులు ట్రెజరీల్లో పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం నెలకు సుమారు ?700 కోట్ల నుండి ?2000 కోట్ల చొప్పున గ్రీన్ ఛానల్ ద్వారా నిధులను విడుదల చేస్తోంది. అయితే, ఉద్యోగ విరమణ చేసిన వారికి తక్షణ ఆర్థిక ఉపశమనం లభించాలన్నా, పేరుకుపోయిన మొత్తం బకాయిలు త్వరితగతిన పూర్తిగా క్లియర్ కావాలన్నా ప్రభుత్వం నెలకు కనీసం ?3000 కోట్ల నుంచి ?4,000 కోట్ల నిధులను కేటాయించాల్సిన అవసరం ఉంది. అప్పుడే ఉద్యోగుల సమస్యలు శాశ్వతంగా పరిష్కారమవుతాయి.

పాలకులు తక్షణమే స్పందించాలి

ఉద్యోగులు, ఉపాధ్యాయుల న్యాయమైన హక్కుల సాధన కోసం సెప్టెంబర్ 10న ఎల్బీ స్టేడియంలో జేఏసీ తలపెట్టిన ఈ మహాధర్నా ప్రభుత్వానికి ఒక స్పష్టమైన హెచ్చరిక లాంటిది. ప్రభుత్వ పాలనను ముందుకు నడిపించే ఉద్యోగుల సమస్యలను ఇకపై ఉపేక్షించడం సరికాదు. కొత్త పీఆర్సీ అమలు, పెండింగ్ డీఏలు, బిల్లుల తక్షణ విడుదల, సీపీఎస్ రద్దు వంటి నాలుగు ప్రధాన డిమాండ్లపై పాలకులు కాలయాపన చేయకుండా తక్షణమే స్పందించాలి. ఉద్యోగులతో గౌరవప్రదమైన చర్చలు జరిపి, ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో నెరవేర్చినప్పుడే ఉద్యోగ వర్గాల్లో నెలకొన్న అభద్రతాభావం తొలగిపోతుంది. ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకొని సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తుందని ఆశిద్దాం. లేనిపక్షంలో ఈ ఉద్యమం మరింత తీవ్రరూపం దాల్చడం ఖాయం.

## అభివృద్ధి కార్యక్రమాలను గాలికి వదిలేసిన అనుముల సంధ్యారాణి సర్పంచ్ సెక్రెటరీ రవీందర్

**రెండో వార్డు నెంబర్ మా రోడ్డు బాగా బురద ఉంది అని పదేపదే చెప్పినా పట్టించుకోని వైనం**

**మన దునియా, వాజేడు, సెప్టెంబర్ 9**

చంద్రుపట్లలో రెండో వార్డ్ మెంబర్ ఉన్న బజార్లో రోడ్డు ఎంత దారుణంగా ఉంది కనీసం వార్డు మెంబరు గ్రామసభ పెట్టినప్పుడు లోకల్ బాడీ మీటింగ్ పెట్టినప్పుడు ప్రతిసారి మీటింగ్ లో కూడా రోడ్డుకు కంకర గానే గ్రావెల్ గాని వేయించండి అని చెప్పిన సర్పంచ్ సెక్రెటరీ పట్టించుకోవడం లేదు చిన్నపిల్లలు ఇంట్లో నుండి రోడ్డు మీదకి రావాలంటే తల్లిదండ్రులు ఎత్తుకొని బయటికి తీసుకురావాల్సి వస్తుంది కనీసం మోటార్ సైకిల్ ఇంటిలో నుండి బయటికి రావాలన్న ఆ బురదలో నుండి రాలేక ఎక్కడో రోడ్డు బయటే పెట్టి ఇంటికి వస్తున్నారు ఇటువంటి పరిస్థితులు ఉన్న ఎంపీడీవో కృపాకర్ గారికి స్వయాన చూపించిన నేను పది రోజుల్లో క్లియర్ చేపిచ్చి రోడ్డుకు గ్రావెల్ గాని కంకర గాని పోయిస్తామని అన్నారు కానీ పది రోజులు సమయం గడిచిపోయినది కానీ ఇప్పటివరకు సర్పంచ్ సెక్రెటరీన ఎవరిని అడిగినా దానికి సంబంధించి కుంటి సాకులు చెపుతూ మాటలతో తప్పిస్తున్నారు తప్ప కనీసం ప్రజల ఇబ్బందిని పట్టించుకునే పరిస్థితి లేదు గ్రామపంచాయతీలో నిధులు లేవా లేక వీళ్ళ నిర్లక్ష్యానికి ప్రజలను ఇబ్బంది పెడుతున్నారా కనీసం సాటి జనాభా రోడ్డుకు ఎక్కినప్పుడు చిన్న బురదగుంట ఉంటేనే తప్పించుకొని పోతాం దారి పొడుగునా వంద మీటర్ల దూరం ఆ బురదలో నాటు వేసే పరిస్థితి ఉంది కనీసం మరి గ్రావెల్ గాని కంకర గాని ఒక ఆరు ఏడు ట్రిప్పులు తీసుకొచ్చి పోసిన కొంత మేరకు ఇబ్బంది తగ్గుతుంది ఎనిమిది పది ట్రిప్పుల గ్రావేల్ కు ఎన్ని లక్షల అవుతాయి పాలను గాలికి వదిలేసి వాళ్ల సొంత పనుల్లో నిమగ్నమైనట్టు కనిపిస్తుంది ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజల అవసరాలను పట్టించుకోక పోవడం ఆశ్చర్యంగా ఉంది రెండో వార్డు నెంబరు తోంగల ఉషారాణి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోకుండా నిర్లక్ష్యానికి గురి చేస్తున్నారు ఈ విషయాలపై ఎంపీడీవో తక్షణమే చర్య తీసుకోవాలని రెండో వార్డ్ మెంబర్ మరియు ఆ వీధిలో ఉన్న ప్రజలు కోరుతున్నారు





మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం



# వేయిస్తంభాల ఆలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య





**మన దునియా,హనుమకొండ:సెప్టెంబర్ 09**

చారిత్రక వేయి స్తంభాల దేవాలయంలో శ్రీ ఉత్తిష్ఠ గణపతి నవరాత్రి మహోత్సవాలకు సంబంధించిన కరపత్రాన్ని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ఆవిష్కరించారు. సెప్టెంబర్ 14 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్న నవరాత్రి మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో విజయవంతం చేయాలని ఎంపీ ఆకాంక్షించారు.ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆలయంలోని శ్రీ రుద్రేశ్వరస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య ఎంపీకి వేద ఆశీర్వచనం అందించారు. ఆధ్యాత్మిక, చారిత్రక వైభవానికి ప్రతీకగా నిలిచిన వేయిస్తంభాల ఆలయంలో నిర్వహించే గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య ఆకాంక్షించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ నిర్వాహకులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో డి. అనిల్ కుమార్, ప్రధానార్చకులు గంగు ఉపేంద్ర శర్మ, మణికంఠ అవధాని, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి.





**రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్.**

**మన దునియా,ములుగు జిల్లా:సెప్టెంబర్ 09**

ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 27వ తేదీన జిల్లాలలో వివిధ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్ అన్నారు. బుధవారం హైదరాబాదు నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఇతర శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని వీడియో సమావేశ మందిరం నుండి జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు హాజరయ్యారు.ఈ సందర్భంగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ జిల్లాలలో పర్యాటక రంగ అభివృద్ధికి జిల్లా స్థాయిలో నోడల్ అధికారులను నియమించి, వివిధ శాఖల సమన్వయంతో పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేయాలని తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకొని ఆకర్షణీయమైన కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. యువతలో పర్యాటక రంగంపై ఆసక్తిని పెంపొందించి, జిల్లాలలో పర్యాటక ప్రదేశాల ప్రచారం, అభివృద్ధి కోసం ఆసక్తి కలిగిన యువతను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. యువ టూరిజం క్లబ్‌ల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేసే కార్యక్రమాలను ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలలో నిర్వహించాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 142 పర్యాటక ప్రాంతాలను గుర్తించిన నేపథ్యంలో, ఆయా ప్రాంతాలలో సందర్శకులకు అవసరమైన ప్రాథమిక సౌకర్యాలు, మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. పర్యాటక ప్రాంతాల ప్రాముఖ్యతను విస్తృతంగా ప్రజలలోకి తీసుకు వెళ్లేందుకు వినూత్న ప్రచార కార్యక్రమాలు చేపట్టడంతో పాటు ఫిల్మ్ టూరిజం ద్వారా పర్యాటక ప్రాంతాలను ప్రోత్సహించాలని తెలిపారు. జ్ఞాన భారత్ కార్యక్రమంలో భాగంగా అందుబాటులో ఉన్న పురాతన మాన్యుస్క్రిప్ట్‌లను గుర్తించి డిజిటలైజేషన్ చేయడం జరుగుతుందని, ఇందు కోసం జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, జిల్లాలోని వివిధ ప్రాంతాలు, దేవాలయాలు, మఠాలు, గ్రంథాలయాలు, విద్యాసంస్థలు, ఇతర సంస్థలు, వ్యక్తుల వద్ద అందుబాటులో ఉన్న మాన్యుస్క్రిప్ట్‌లను గుర్తించి సమగ్ర జాబితా రూపొందించాలని తెలిపారు. గుర్తించిన మాన్యుస్క్రిప్ట్‌లను డిజిటలైజ్ చేసి, కేంద్రీకృత సేకరణ లోకి తీసుకువచ్చే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలోని చారిత్రక, సాంస్కృతిక, సహజ పర్యాటక ప్రదేశాలను సమగ్రంగా అభివృద్ధి చేసి, వాటికి విస్తృత ప్రచారం కల్పించడం ద్వారా జిల్లాను ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని, పర్యాటక ప్రాంతాలను ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృత ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, జిల్లా టూరిజం నోడల్ ఆఫీసర్ డాక్టర్ ధర్మ నాయక్, డి ఈ ఓ సిద్ధార్థ రెడ్డి, డి ఐ ఓ వీరేందర్, డి పి ఆర్ ఓ రఫిక్, తదితరులు పాల్గొన్నారు.

## ఇండోర్ స్టేడియంలో క్రీడాకారులకు మెరుగైన సౌకర్యాలు: కలెక్టర్

**మన దునియా,హైదరాబాద్:సెప్టెంబర్ 09**

గద్వాల: గద్వాల ఇండోర్ స్టేడియంలో క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన సౌకర్యాలు కల్పించనున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. బుధవారం గద్వాలలోని ఇండోర్ స్టేడియాన్ని కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు. బ్యాడ్మింటన్ కోర్టు, జిమ్, మార్షల్ ఆర్ట్స్ విభాగాలను పరిశీలించి అవసరమైన పనులపై అధికారులకు సూచనలు చేశారు. స్టేడియం ప్రహరీపై క్రీడలకు సంబంధించిన పెయింటింగ్స్‌తో పాటు ప్రముఖ క్రీడాకారుల చిత్రాలు, వారి వివరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.బ్యాడ్మింటన్ కోర్టులో సింథటిక్ మ్యాట్, లైటింగ్ ఏర్పాటు చేయాలని, మరుగు దొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. స్టేడియం లోని ఫ్లడ్‌లైట్లు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవడంతో పాటు అన్ని పనులను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.పర్యటనలో అదనపు కలెక్టర్ మధుమోహన్, ఇన్‌చార్జి డీవైఎస్ఓ రామలింగేశ్వర గౌడ్, స్టేడియం ఇన్‌చార్జి బషీర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా కాళోజి నారాయణరావు జయంతి వేడుకలు

**మన దునియా, సెప్టెంబర్ 09,మంచిర్యాల జిల్లా**



మందమర్రి ఏరియాలోని జనరల్ మేనేజర్ కార్యాలయంలో బుధవారం ప్రజాకవి, పద్మవిభూషణ్ కాలోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై, కాలోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ శ్రీ ఎన్. రాధాకృష్ణ మాట్లాడుతు కాలోజీ నారాయణరావు గారు తన కలం, గళంతో తెలంగాణ ప్రజా చైతన్యానికి, భాషా వికాసానికి దిశానిర్దేశం చేశారని కొనియాడారు.కాలోజీ జయంతిని తెలంగాణ ప్రభుత్వం ‘తెలంగాణ భాషా దినోత్సవం’గా జరుపుకోవడం మనందరికీ గర్వకారణమని పేర్కొన్నారు.”పుట్టుక నీది, చావు నీది... బతుకంతా దేశానిది” అని చాటిచెప్పిన కాలోజీ సిద్ధాంతాలు, ఆయన పాటించిన విలువలు నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జి ఎం, జి ఎల్. ప్రసాద్,ఏఐటీయూసీ, జి ఎం స్ట్రక్చర్ కమిటీ మెంబర్, సివి రమణ, సీఎం ఓ ఏ ఐ జాయింట్ సెక్రటరీ, రవి, ఏరియా ఈ అండ్ ఎం ఏ జి ఎం. బాలాజీ భగవతిజ, కేకే ఏజెంట్, ఖదిర్,శాంతి ఖని, ఏజెంట్, సంతోష్ కుమార్, కేకే ఓ సి పి ప్రాజెక్ట్ ఆఫీసర్ రాంబాబు, డి జి యం (పర్సనల్) సిహెచ్. అశోక్, సీనియర్ పి ఓ, ఆర్. సత్యనారాయణ ఏరియా ఉన్నత అధికారులు , వివిధ విభాగాల అధిపతులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొని ప్రజాకవి కాలోజీ సేవలను స్మరించుకున్నారు.

## 2 వ సారి ఏకగ్రీవంగా ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా రామ రాజేష్ ఖన్నా ఎన్నికయ్యారు

**మన దునియా,వరంగల్ జిల్లా:సెప్టెంబర్09**



తెలంగాణ రాష్ట్ర ఏఐటీయూసీ నాలుగవ మహాసభలు కరీంనగర్ జిల్లాలో పద్మనాయక ఫంక్షన్ హాల్ లో సెప్టెంబర్ 6 ,7 మరియు 8 తేదీల్లో నిర్వహించినారు. ఇందులో భాగంగా జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా ను తెలంగాణ ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా రెండవ సారి ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... పేద ప్రజల అభ్యున్నతికి తను ఎప్పటికీ ఎల్లప్పుడు కృషి చేస్తానని తెలిపారు. అంతేకాకుండా గత కొన్ని సంవత్సరాలుగా జాతీయ ఆరోగ్య మిషన్ లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ మరియు ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తున్నానని తెలిపారు జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులందరినీ రెగ్యులరైజేషన్ చేయాలని (లేదా) సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నా ఎన్నిక కు సహకరించిన ఏఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహ కు, జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ సెక్రెటరీ దేవనబోయిన బాపు యాదవ్ కి మరియు ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులందరికీ పేరు పేరునా ధన్యవాదములు , కృతజ్ఞతలు తెలియజేశారు..

## తెలంగాణ : వచ్చే రెండు గంటల్లో భారీ వర్షాలు: వాతావరణ శాఖ

**మన దునియా,హైదరాబాద్:సెప్టెంబర్ 09**



తెలంగాణ : వచ్చే రెండు గంటల్లో భారీ వర్షాలు: వాతావరణ శాఖ తెలంగాణలోని జగిత్యాల, పెద్దపల్లి, నిజామాబాద్, ఏపీలోని అనకాపల్లి పరిసర ప్రాంతాల్లో బుధవారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో ఉక్కపోత నుండి ప్రజలకు ఉపశమనం లభించింది. రాబోయే రెండు గంటల్లో నల్గొండ, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.. ఉరుములు, ఈదురుగాలుల నేపథ్యంలో వాహనదారులు, రైతులు, ఆయా జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## అసెంబ్లీ నడవకుండా బీజేపీ సభ్యులు అడ్డుపడుతున్నారు: మంత్రి కోమటిరెడ్డి

**మన దునియా,హైదరాబాద్:సెప్టెంబర్ 09**



బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డిపై తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎంను ఏకవచనంతో ఆయన మాట్లాడారని ధ్వజమెత్తారు. మహేశ్వర్ రెడ్డి ఆ వ్యాఖ్యలను వెంటనే వాపస్ తీసుకోవాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ నడవకుండా బీజేపీ సభ్యులు అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. దళితులు నిరసన తెలిపిన ఎర్రవల్లి ఫాంహౌస్‌ను శుద్ధి చేసి వారిని అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలు తెలంగాణలో దళితులు ఉండవద్దని కోరుకుంటున్నారా అని మంత్రి కోమటిరెడ్డి ప్రశ్నించారు..

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

## ఏసీబీ వలలో సంగారెడ్డి జిల్లా డీఐఈఓ

**రూ.20 వేల లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన అధికారి.**

**మన దునియా,సంగారెడ్డి జిల్లా: సెప్టెంబర్:09**



సంగారెడ్డి జిల్లా డిస్ట్రిక్ట్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ రామావత్ గోవింద్ రామ్ అవినీతి నిరోధక శాఖ వలలో చిక్కారు. బుధవారం మధ్యాహ్నం సుమారు 1.20 గంటల సమయంలో తన కార్యాలయంలో రూ.20 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఫిర్యాదు దారుడికి చెందిన వికాస్ వొకేషనల్ జూనియర్ కళాశాల ప్రొవిజనల్ అనుబంధ గుర్తింపు పొడిగింపు కోసం తనిఖీ నిర్వహించి, నివేదిక సమర్పించాల్సి ఉంది. ఈ అధికారిక పని చేసేందుకు డీఐఈఓ తొలుత రూ.50 వేల లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ వెల్లడించింది. ఇప్పటికే రూ.30 వేల లంచం స్వీకరించినట్లు, మిగిలిన రూ.20 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నట్లు తెలిపింది.లంచంగా స్వీకరించిన రూ.20 వేల నగదును అధికారి వద్ద నుంచి ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రజా విధులను సక్రమంగా నిర్వర్తించకుండా, అక్రమ ప్రయోజనం పొందేందుకు అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు ఏసీబీ పేర్కొంది.అనంతరం నిందితుడిని అరెస్టు చేసి హైదరాబాద్‌లోని ఎస్‌పీఈ అండ్ ఏసీబీ కేసుల విచారణ కోసం ప్రత్యేక న్యాయస్థానంలోని ×× అదనపు ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట హాజరుపరుస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.ఫిర్యాదుదారుడి భద్రతా కారణాల దృష్ట్యా ఆయన వివరాలను ఏసీబీ అధికారులు వెల్లడించలేదు.

## చిలకలూరిపేటలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకుల అరెస్ట్: 1.3 కేజీల సరుకు స్వాధీనం

**మన దునియా,చిలకలూరిపేట:సెప్టెంబర్ 09**

పట్టణ పరిధిలోని సుగాలి కాలనీలో గంజాయి నిల్వ ఉంచి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి సుమారు 1,300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ పి.రమేష్ తెలిపారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సుగాలి కాలనీలోని ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో కొందరు గంజాయి విక్రయిస్తున్నట్లు అందిన పక్కా సమాచారంతో సీఐ పి.రమేష్ ఆదేశాల మేరకు ఎస్సై వి.సోమేశ్వరరావు తమ సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ దాడిలో గంజాయి కలిగి ఉండి, విక్రయాలకు పాల్పడుతున్న వాంకుడవత్ పవన్ కుమార్ నాయక్ (19), మేఘవత్ మణిగోపాల్ నాయక్ (22)లను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.నిందితుల వద్ద నుంచి దాదాపు 1,300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అనంతరం నిందితులను రిమాండ్ నిమిత్తం న్యాయస్థానంలో హాజరుపరిచారు. పట్టణంలో మత్తు పదార్థాలు, గంజాయి వంటి అసాంఘిక కార్యకలా పాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా సీఐ హెచ్చరించారు.

## కారును తప్పించబోయి డీసీఎం బోల్తా.. జాతీయ రహదారిపై స్తంభించి

**నిజామాబాద్ జిల్లా మన దునియా: ప్రతినిధి:**

డిచ్?పల్లి: డీసీఎం ట్రక్ ఆక్సిడెంట్ ముందు వెళ్తున్న కారును తప్పించే క్రమంలో డీసీఎం లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటన ఇందల్వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలోని చంద్రయాన్?పల్లి శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం ఉదయం చోటుచేసుకుంది.డీసీఎం ట్రక్ ఆక్సిడెంట్ హైదరాబాద్? నుంచి నాగ్?పూర్? వైపు వెళ్తున్న..స్థానికుల వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి నాగ్‌పూర్ వైపు పార్సిల్ లోడుతో వెళ్తున్న డీసీఎం లారీకి ముందున్న కారును ఓవర్ టేక్ చేసే క్రమంలో డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోయాడు. దీంతో డీసీఎం రోడ్డుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్రగాయాలు కాగా, హైవే అంబులెన్స్ సిబ్బంది అతడిని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.డీసీఎం ట్రక్ ఆక్సిడెంట్ గంటకు పైగా స్తంభించిన ట్రాఫిక్ డీసీఎం లారీ రోడ్డుపై బోల్తా పడటంతో వాహనాలకు తీవ్ర అంతరాయం ఏర్పడి జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ స్తంభించింది. సుమారు గంటపాటు వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని బోల్తాపడిన డీసీఎంను తొలగించే చర్యలు చేపట్టి, తీవ్రంగా శ్రమించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.



# గణేష్ మండపాల వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేయాలి సదాశివనగర్ సిఐ వీరయ్య

**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి :**

కామారెడ్డి జిల్లా సదాశివనగర్ గాంధారి తాడ్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునేందుకు మండపాల నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని సదాశివనగర్ సీఐ వీరయ్య తెలిపారు. గణేష్ మండపాల నిర్వహణకు సంబంధించిన పోలీస్ శాఖ రూపొందించిన ఆన్లైన్ ఇంటిమేషన్ విధానం ద్వారా మండపాల వివరాలను ముందస్తుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. మండపాల వివరాలను ముందుగా పోలీసులకు తెలియజేయడం వల్ల ఆయా ప్రాంతాలలో భద్రత బందోబస్తు ఏర్పాటు చేయడం సులభతరం అవుతుందని పేర్కొన్నారు ఆన్లైన్ ఇంటిమేషన్ నమోదుకు ఎలాంటి రుసుం లేదని స్పష్టం చేశారు గణేష్ మండపాల నిర్వాకులు కంప్యూటర్ లేదా మొబైల్ ద్వారా పోలీస్ శాఖ వెబ్ సైట్ లో వివరాలను నమోదు చేసి దరఖాస్తును సంబంధిత పోలీస్ స్టేషన్ కు అందజేయాలని సూచించారు. గణేష్ మండపాలను ప్రజా రవాణాకు అత్యవసర వాహనాలు రాకపోకలకు ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చేయాలని సూచించారు సంబంధిత శాఖల అనుమతులతో పాటు విద్యుత్ శాఖ అనుమతి తీసుకొని తర్వాత విద్యుత్ కనెక్షన్ పొందాలని తెలిపారు మండపాల పూర్తి బాధ్యత నిర్వాహకులదేనని గణేష్ మండపం వద్ద నిర్వాహకుల పేర్లు ఫోన్ నంబర్లు స్పష్టంగా ప్రదర్శించాలని 24 గంటల పాటు కనీసం నలుగురు వాలంటరీలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు మండపాల వద్ద బుక్కు ఏర్పాటు చేసుకోవాలని ఉదయం సాయంత్రం రాత్రి సమయంలో పోలీస్ సిబ్బంది పరిరక్షణకు వచ్చినప్పుడు నిర్వాహకులు సహకరించాలని సూచించారు గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేసే ప్రదేశంలో షెడ్డును నాణ్యతతో నిర్మించాలని విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డీజేలకు అనుమతి లేదు. గణేష్ మండపాలల్లో శోభయాత్రలలోఎట్టి పరిస్థితుల్లోను డీజే లను ఏర్పాటు చేయరాదని సదాశివనగర్ సిఐ వీరయ్య స్పష్టం చేశారు. విద్యా సంస్థలు ఆసుపత్రిలో ప్రార్థన మందిరాలు వృద్ధులు. చిన్నపిల్లలకు ఇబ్బంది కలగకుండా పోలీసుల అనుమతితో చిన్న స్పీకర్లను మాత్రం వినియోగించాలని సూచించారు మండపాల వద్ద భక్తు గీతాలను మాత్రమే ప్లే చేయాలని సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లను వినియోగించుకోవాలని తెలిపారు. మండపాల వద్ద మద్యం సేవించడం జూదం ఆడడం అసభ్యకరంగా నృత్యాలు నిర్వహించడం. ఇతరులను కించపరిచేలా ప్రసంగాలు లేదా పాటలు ఏర్పాటు చేయడం పూర్తిగా నిషేధమని పేర్కొన్నారు. మండపాల వద్ద అనుమానాస్పద బ్యాగులు వస్తువులు లేదా వ్యక్తులు కనిపిస్తే వెంటనే డైల్ 112 లేదా తాడ్వాయి గాంధారి సదాశివ నగర్ పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని సూచించారు. మండపాల వద్ద నిర్వహించే సంస్కృతి ఇతర కార్యక్రమాల వివరాలను ముందుగానే పోలీసులకు తెలియజేయాలని తెలిపారు. గణేష్ ప్రతిష్టాపన రోజున నిర్ణీత సమయానికి విగ్రహాన్ని మండపానికి చేర్చేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని సూచించారు నిమర్జనం శోభయాత్రను మధ్యాహ్నం నుంచే ప్రారంభించి నిర్ణయించిన సమయానికి నిమజ్జనం పూర్తి చేయాలి. ఇతరులపై రంగులు చల్ల రాదని ఇతరులను కించపరిచేలా నినాదాలు చేయరాదని సూచించారు శోభయాత్రలు టపాసులు పేల్చడం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు డ్రైవర్ కు చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ తో పాటు వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు ఉండాలని తెలిపారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా ఎక్కడైనా ఎలాంటి అవాంఛనియ సంఘటనలు జరుగుతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ప్రతి గ్రామంలో పోలీస్ సిబ్బంది ముమ్మరంగా పెట్రోలింగ్ జరుగుతుందన్నారు. మహిళలు పిల్లలకు ఇబ్బందులు కలిగించే వారిపై పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని పోలీస్ శాఖ సూచించిన నియమ నిబంధనలను పాటిస్తూ గణేష్ నవరాత్రుల ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు నిర్వాహకులు పూర్తిగా సహకరించాలని సదాశివనగర్ సీఐ వీరయ్య కోరారు.




# కాళోజీ నారాయణరావు జీవితం ఆదర్శప్రాయం

**ప్రజాస్వామ్య విలువల కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం**
**కాళోజీ స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాడాలి**
**బీజేపీ ములుగు జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సుమలత**

**మన దునియా,ములుగు,సెప్టెంబర్ 09**

కాళోజీ నారాయణరావు జీవితం ఆదర్శప్రాయమని,ప్రజాస్వామ్య విలువల కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని,కాళోజీ స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాడాలని బీజేపీ ములుగు జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సుమలత అన్నారు.ప్రజాకవి, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా బీజేపీ ములుగు జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సుమలత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాళోజీ నారాయణరావు తన కలం ద్వారా ప్రజల సమస్యలను, సామాజిక అసమానతలను, అన్యాయాలను ప్రశ్నించి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని అన్నారు. తెలంగాణ ప్రజల హక్కులు, స్వాభిమానం, ప్రజాస్వామ్య విలువల కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. "నా గొడవ" వంటి రచనల ద్వారా సమాజంలోని వాస్తవ పరిస్థితులను నిర్భయంగా ఎత్తిచూపిన కాళోజీ, సామాన్యుడి గొంతుకగా నిలిచారని సుమలత అన్నారు. పదవులు, ప్రలోభాలకు అతీతంగా ప్రజా సమస్యలపై స్పందించిన ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శమని తెలిపారు.కాళోజీ ఆశయాలను ముందుకు



తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని, సమాజంలో అన్యాయం జరిగినప్పుడు ప్రశ్నించే ధైర్యాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సుమలత పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యం, మానవత్వం, సామాజిక న్యాయం కోసం కాళోజీ చూపిన మార్గాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భవాని, స్రవంతి, శశికాంత, స్వర్ణలత, అనూష, స్రవంతి, భవాని, శ్రీలత, లావణ్య పాల్గొన్నారు

# మంత్రాల నెపంతో మహిళ దారుణ హత్య

**అర్ధరాత్రి మరిది ఘాతుకం.. నెల్కి వెంకటాపూర్‌లో కలకలం**

**మన దునియా,దండేపల్లి;సెప్టెంబర్ 9:**

మంత్రాలు చేస్తున్నారనే అనుమానంతో ఓ మహిళ దారుణ హత్యకు గురైన విషాద ఘటన మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం నెల్కి వెంకటాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సింగతి లక్ష్మి (42)ను ఆమె మరిది అర్ధరాత్రి సమయంలో దారుణంగా హత్య చేసినట్లు సమాచారం.గ్రామస్తులు నిద్రిస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకోవడంతో ఒక్కసారిగా కలకలం రేగింది. మంత్రాల నెపంతోనే లక్ష్మిపై దాడికి పాల్పడినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. హత్యకు అసలు కారణాలు ఏమిటి? మంత్రాలపై ఉన్న అనుమానమే కారణమా? లేక కుటుంబ కలహాలు, ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు తెలుస్తోంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, ఘటనకు సంబంధించి వివరాలను సేకరిస్తున్నట్లు సమాచారం. మూఢనమ్మకాల కారణంగా ఓ మహిళ ప్రాణాలు కోల్పోయిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి రావాల్సి ఉంది.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం



# ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్ భవేష్ మిశ్రా








**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి**

పోలీసుశాఖలో ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్?ను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. నిజామాబాద్‌ఫ్రీ పోలీస్ ట్రైనింగ్ ।ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్? భవేష్? మిశ్రా పోలీసుశాఖలో ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్?ను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు.

ట్రైనింగ్

నిజామాబాద్ సిటీ: ఫ్రీ పోలీస్ ట్రైనింగ్ పోలీసుశాఖలో ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్?ను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో కొనసాగుతున్న ప్రీ రిక్రూట్ మెంట్ శిక్షణ శిబిరాన్ని సీపీ సాయి చైతన్యతో కలిసి కలెక్టర్ బుధవారం సందర్శించారు.

ఫ్రీ పోలీస్ ట్రైనింగ్ రెండునెలల పాటు..

కలెక్టర్ భవేష్ మిశ్రా అభ్యర్థులకు సలహాలు, సూచనలు అందించారు. రీజనింగ్ ఎబిలిటీ, ఆంగ్లం, గణితం అంశాలలో ఎక్కువ మార్కులు సాధించడానికి పాటించాల్సిన పద్ధతుల గురించి మెలకువలు తెలియజేశారు. ఉద్యోగార్థులకు తానే స్వయంగా నైపుణ్య సామర్థ్య పరీక్షలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.ప్రభుత్వ ఉద్యోగాలకు విపరీతమైన పోటీ నెలకొని ఉన్న ప్రస్తుత తరుణంలో ఏకాగ్రత, పట్టుదలతో ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తేనే కొలువు సాధించగల్గుతారని సూచించారు. పోలీస్ కమిషనర్ పి.సాయిచైతన్య మాట్లాడుతూ హైదరాబాద్?లో అందించే కోచింగ్?కు ఏమాత్రం తక్కువ కాకుండా మరింత మెరుగైన మెటీరియల్?తో పాటు, నిష్ణాతులైన ఫ్యాకల్టీచే స్థానికంగా శిక్షణ తరగతులు ఏర్పాటు చేయించామని చెప్పారు. ప్రీ రిక్రూట్ మెంట్ ట్రైనింగ్ కార్యక్రమానికి జిల్లా యంత్రాంగం తరపున కలెక్టర్ అన్ని విధాలుగా తోడ్పాటును అందించారని జిల్లా పోలీస్ శాఖ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

ఫ్రీ పోలీస్ ట్రైనింగ్ । ఏకాగ్రతతో చదవాలి

నిరుద్యోగ యువతకు సరైన మార్గదర్శకత్వం అందించడం పోలీస్ శాఖ సామాజిక బాధ్యతలో భాగమని తెలిపారు. రెండు నెలల పాటు వినోదాలు, వేడుకలకు దూరంగా ఉండి, ఏకాగ్రతతో కృషి చేస్తే పోలీస్ శాఖలో చేరాలనే కలను సాకారం చేసుకోగలుగుతారని అన్నారు. ఉద్యోగార్థులకు భోజన వసతిని సమకూరుస్తూ రెండునెలల పాటు నిష్ణాతులచే థియరీ, దేహదారుఢ్య పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చాటేలా శిక్షణ అందిస్తున్నామన్నారు. హైదరాబాద్‌కు చెందిన భాగ్యకిరణ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు, నిపుణులతో మెళకువలు నేర్పిస్తూ, అన్ని విధాలుగా సన్నద్ధం చేసేలా చర్యలు తీసుకున్నారు. గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్ రెడ్డి, భాగ్యకిరణ్ ఇనిస్టిట్యూట్? డైరెక్టర్ భాగ్య కిరణ్, నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్ యాదవ్ పాల్గొన్నారు.

# సాగునీరు విడుదల... అన్నదాతల ఆనందం





**అలీసాగర్ ఎత్తిపోతల పథకం కింద కోస్లీ పంప్ హౌజ్ నుండి సాగునీటి విడుదల**

**సాగునీటిని పొదుపుగా వినియోగించాలని సూచన**

**ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్యే భూపతి రెడ్డి**

**53793 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు**

**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి:**

నిజామాబాద్ జిల్లాలో ఖరీఫ్ లో సాగు చేసిన పంట పొలాలకు సాగునీరు అందించాలన్న రైతుల కోరిక మేరకు .. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డిల కృషి ఫలితంగా గుత్పా, అలీ సాగర్ ఎత్తిపోతల పథకం ద్వారా రైతులకు సాగునీరు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. ఇటీవల ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, భూపతి రెడ్డి లు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడారు.. వరి పంట పొట్ట దశలో ఉన్న నేపథ్యంలో 10 రోజులకు ఒక్కసారి విడతల వారీగా సాగునీరు అందించాలని రైతుల విజ్ఞప్తి మేరకు గుత్ప, అలీ సాగర్ ఎత్తిపోతల పథకం ద్వారా నిజాంసాగర్ నుంచి నీటిని విడుదల చేయాలని కోరగా.. మంత్రి సానుకూలంగా స్పందించి అందుకు అవసరమైన ఆదేశాలను అధికారులకు జారీ చేశారు.ఈ సందర్భంగా బుధవారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి లు అలీ సాగర్ లిఫ్ట్ ఇరిగేషన్ పరిధిలోని నవీపెట్ మండలం కోస్లీ పంప్ హౌజ్ వద్ద నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి ప్రత్యేక పూజలు చేసి.. బటన్ నొక్కి నీటిని విడుదల చేశారు.కాగా నవీపెట్, రేంజల్, ఎడపల్లి, నిజామాబాద్ రూరల్ , డిచ్ పల్లి, మాక్లూర్, 6 మండలాల పరిధిలోని సుమారు 53793 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుంది.10 రోజుల పాటు 540 క్యూ సెక్కుల నీటిని విడుదల చేయనున్నారు.దీంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తూ.. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ మేరకు వారు మాట్లాడుతూ.. ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో అన్నదాతలు సాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు.రైతులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ప్రభుత్వం సాగునీటిని విడుదల చేస్తోందని పేర్కొన్నారు. ఎక్కడ కూడా లీకేజీ సమస్యలు లేకుండా చివరి ఆయకట్టు వరకు నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి,రాష్ట్ర గీత పారిశ్రామిక కార్పొరేషన్ చైర్మన్ శేఖర్ గౌడ్, తాహెర్ బిన్ హందాన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, అధికారులు తదితరులు

## ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ నివాసం వద్ద 'నిజం గెలిచింది' కార్యక్రమం - 53 కొవ్వొత్తులతో సంఘీభావం










**మన దునియా, చిలకలూరిపేటలో:**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా అప్పట్లో జరిగిన పోరాటాన్ని స్మరించుకుంటూ, శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ నివాసం వద్ద సోమవారం 'నిజం గెలిచింది' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులతో కలిసి ఆయన 53 కొవ్వొత్తులు వెలిగించి, 'చంద్రబాబు నాయకత్వం వర్ధిల్లాలి' అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ రాజకీయ కక్షసాధింపులతో మూడేళ్ల క్రితం సరిగ్గా ఇదే రోజున చంద్రబాబును అక్రమ కేసులో నిర్బంధించారని గుర్తుచేశారు. ఆ 53 రోజుల పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగుజాతి మొత్తం "నిజం గెలవాలి" అంటూ ఆయనకు అండగా నిలిచిందని, చివరకు న్యాయస్థానాలు అక్రమ కేసులను కొట్టివేయడంతో 'నిజం గెలిచింది' అని స్పష్టం చేశారు. నాటి చీకటి రోజులను గుర్తుచేసుకుంటూ, నవ్యాంధ్రను స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి రాష్ట్ర ప్రజలంతా సంపూర్ణ మద్దతుగా నిలవాలని ఆయన తెలిపారు.

## స్థానిక ఎన్నికల సమరానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు సిద్ధం కావాలి: మాజీ మంత్రి విడదల రజిని

**మన దునియా, చిలకలూరిపేటలోని:**

వైఎస్సార్‌సీపీ కార్యాలయం లో మాజీ మంత్రి విడదల రజిని ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గస్థాయి విస్తృత సమావేశం జరిగింది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేసి ప్రతి వార్డు, ప్రతి గ్రామంలో వైఎస్సార్‌సీపీ బలాన్ని చాటాలని మాజీ మంత్రి పిలుపునిచ్చారు. కష్టకాలంలో పార్టీ కోసం నిలబడిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.





# ‘టాక్సిక్’ ఫలితంపై యశ్ స్పందన.. ఏమన్నారంటే?



కన్నడ రాకింగ్ స్టార్ యశ్ నటించిన ‘టాక్సిక్’ చిత్ర ఫలితంపై ఆయన స్పందన ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. యశ్ సన్నిహితుడైన జైదేవ్ ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ, సినిమా విడుదల అనంతరం తాను యశ్‌తో రెండుసార్లు మాట్లాడానని వెల్లడించారు. ఆ సంభాషణలో యశ్ ఏమన్నారో జైదేవ్ వివరించారు.జైదేవ్‌తో యశ్ మాట్లాడుతూ, “సినిమా ఫలితం గురించి ఆందోళన చెందవద్దు. దాన్ని ప్రేక్షకుల నిర్ణయానికే వదిలేద్దాం. రాబోయే రోజుల్లో మనం చేయాల్సిన పనులు చాలా ఉన్నాయి” అని పేర్కొన్నట్లు జైదేవ్ తెలిపారు. యశ్ ధైర్యంగా ఈ మాటలు చెప్పినప్పటికీ, ఆయన గొంతులో మాత్రం స్వల్ప నిరాశ కనిపించిందని జైదేవ్ అభిప్రాయపడ్డారు.సినిమా ఫలితంతో సంబంధం లేకుండా ప్రేక్షకుల తీర్పే అంతిమమని జైదేవ్ స్పష్టం చేశారు. ప్రస్తుతం యశ్ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో అభిమానుల మధ్య చర్చనీయాంశమయ్యాయి. తదుపరి ప్రాజెక్టులపై దృష్టి సారించాలన్న యశ్ నిర్ణయాన్ని అభిమానులు హర్షిస్తున్నారు.

# ఈ ఫ్రైడే ఓటీటీ ట్రాక్ పైకి వస్తున్న మూవీస్ ఇవే!

**సూర్య హీరోగా రూపొందిన ‘విశ్వనాథ్ అండ్ సన్స్’**

**ఈ నెల 11వ తేదీ నుంచి ‘నెట్ ఫ్లిక్స్’లో స్ట్రీమింగ్**

**11వ తేదీనే అమెజాన్ ప్రైమ్ లో రానున్న ‘మకుటం’**

**విశాల్ డైరెక్ట్ చేసిన యాక్షన్ మూవీ ఇది**

**అదే రోజున స్ట్రీమింగ్ కి వస్తున్న మలయాళ మూవీ ‘వరవు’**

**‘జీ 5’ ద్వారా పలకరించనున్న కంటెంట్**

ప్రతి ఫ్రైడే ఓటీటీ ట్రాక్ పైకి కొన్ని సినిమాలు దిగిపోతూనే ఉన్నాయి. తమిళ .. మలయాళ సినిమాలు, తెలుగు ఆడియోతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాయి. అలా ఈ వారం ఇక్కడ వాలిపోయిన సినిమాల జాబితాలో, ముందుగా ‘విశ్వనాథ్ అండ్ సన్స్’ కనిపిస్తుంది. వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో, సూర్య - మమితా బైజు ప్రధానమైన పాత్రలను పోషించారు. ఆగస్టు 14వ తేదీన విడుదలైన ఈ సినిమా, 250 కోట్లకి పైకి వసూళ్లను రాబట్టింది. ఈ నెల 11వ తేదీ నుంచి ‘నెట్ ఫ్లిక్స్’లో ఐదు భాషల్లో అందుబాటులోకి రానుంది. విశాల్ హీరోగా నటించిన ‘మకుటం’ సినిమా కూడా ఈ నెలలోనే ఓటీటీకి వచ్చేస్తోంది. భారీ బడ్జెట్ తో నిర్మితమైన ఈ యాక్షన్ డ్రామా, ఆగస్టు 14వ తేదీన థియేటర్లకు వచ్చింది. విశాల్ ద్విపాత్రాభినయం చేసిన ఈ సినిమాలో, ఆయన సరసన నాయికలుగా అంజలి .. దుషారా విజయన్ అలరించారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతాన్ని సమకూర్చిన ఈ సినిమా, ఈ నెల 11వ తేదీ నుంచి ‘అమెజాన్ ప్రైమ్’ ఓటీటీకి రావడానికి సిద్ధమవుతోంది. ఇది విశాల్ దర్శకత్వం వహించిన సినిమా కావడం మరో విశేషం. ఇక మలయాళం నుంచి ‘వరవు’ అనే సినిమా కూడా ఈ నెల 11వ తేదీన బరిలోకి దిగిపోతోంది. ‘జీ 5’ వారు ఈ సినిమా ఓటీటీ హక్కులను దక్కించుకున్నారు. షాజీ కైలాస్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో, జోజు జార్జ్ కథానాయకుడిగా నటించాడు. మిగతా ముఖ్యమైన పాత్రలలో, మురళి గోపి .. అర్జున్ అశోకన్ .. దీపక్ పరంబోల్ కనిపించనున్నారు. జులై 16న థియేటర్లకు వచ్చిన ఈ సినిమాకి, పాజిటివ్ టాక్ వచ్చింది. మరో ఓటీటీ వైపు నుంచి ఏ స్థాయిలో సందడి చేస్తుందనేది చూడాలి.






# ‘సీన్’.. మరోసారి పవర్ ఫుల్ పోలీసాఫీసర్‌గా సూర్య

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, దర్శకుడు జితూ మాధవన్ కాంబినేషన్‌లో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రానికి సంబంధించిన కీలక అప్‌డేట్ వచ్చేసింది. బుధవారం ఈ సినిమా టైటిల్‌ను అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రానికి ‘సీన్’ అనే పేరును ఖరారు చేస్తూ, ఈ ఏడాది దీపావళి కానుకగా నవంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు.ఈ సందర్భంగా విడుదల చేసిన టైటిల్ అనౌన్స్‌మెంట్ టీజర్ సినిమాపై అంచనాలను భారీగా పెంచుతోంది. “అతని నీచమైన స్వభావాన్ని దాచిపెట్టడానికి మీరంతా అతని ప్రతిభను ప్రదర్శిస్తున్నారు” అనే వాయిస్ ఓవర్‌తో టీజర్ ప్రారంభమవుతుంది. ఆ తర్వాత పోలీస్ గెటప్‌లో సూర్య ఒక క్రైమ్ సీన్‌లోకి ఎంట్రీ ఇస్తాడు. “ఎవరు ఎవర్ని చంపారు?” అని ఆయన అడగ్గా, “అది కనుక్కోవడానికే కదా మీరు వచ్చింది” అని ఓ కానిస్టేబుల్ సమాధానమిస్తాడు. ఈ చిత్రంలో సూర్య ‘డీఎస్పీ ఇన్బరాజ్’ అనే పవర్‌ఫుల్ పోలీస్ పాత్రలో నటిస్తున్నారు. “సందేహితులు ఇన్బరాజ్ సార్‌ను చూస్తే చాలు, వింతగా ప్రవర్తించడం మొదలుపెడతారు” అని జైల్ వార్డెన్ చెప్పడం, “ఇన్బరాజ్ సార్ వస్తున్నారు, ఎవరూ బయటకు రావొద్దు” అని ఖైదీలను హెచ్చరించడం వంటి సన్నివేశాలు పాత్ర తీవ్రతను తెలియజేస్తున్నాయి. “నా ముఖం బాగా చూసుకో. నీకు, నిన్ను అరెస్ట్ చేసిన ఒకే ఒక్క పోలీస్‌ను నేనే కావచ్చు.. కానీ నాకు, నేను జైల్లో పెట్టిన 900 మంది నేరస్థుల్లో నువ్వొకడివి” అంటూ సూర్య చెప్పే డైలాగ్ హైలైట్‌గా నిలిచింది.ఈ సినిమా టైటిల్‌ను ప్రకటిస్తూ సూర్య తన ‘ఎక్స్’ ఖాతాలో, “అందరికీ నమస్కారం, ఇదిగో ‘సీన్’ నుంచి చిన్న గ్లింప్స్. నవంబర్ 6 నుంచి థియేటర్లలో. ఒణవవజూఖుఝుశ్రీఅ2026” అని పోస్ట్ చేశారు.ఇప్పటివరకు ‘సూర్య 47’గా పిలవబడిన ఈ సినిమాను జఘురం స్టూడియోస్ నిర్మిస్తోంది. గత ఏడాది డిసెంబర్‌లో ఈ ప్రాజెక్ట్ పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఇందులో సూర్య సరసన నజ్రియా నజీమ్ హీరోయిన్‌గా నటిస్తుండగా, యువ నటుడు నస్లెన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. జాన్ విజయ్, ఆనందరాజ్ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి సుషిన్ శ్యామ్ సంగీతం అందిస్తుండగా, వినీత్ ఆగస్టియన్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. జితూ మాధవన్ - సూర్య కాంబినేషన్ ప్రకటన వచ్చినప్పటి నుంచి ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. సూర్య గతంలో సింగం సిరీస్ సినిమాల్లో శక్తిమంతమైన పోలీస్ అధికారిగా కనిపించడం తెలిసిందే.

# “ఒక్క మెతుకు పొలిమేర దాటదు”.. ‘రణబాలి’గా గర్జించిన విజయ్ దేవరకొండ.. పవర్ ఫుల్ టీజర్

రౌడీ హీరో విజయ్ దేవరకొండ చాలా కాలం తర్వాత తన అభిమానులు కోరుకుంటున్న అసలైన మాస్ అవతారంలోకి మారిపోయారు. రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామా ‘రణబాలి’. తాజాగా ఈ చిత్రం నుంచి విడుదలైన టీజర్ సోషల్ మీడియాలో ప్రకంపనలు సృష్టిస్తూ సినిమాపై అంచనాలను ఆకాశానికి చేర్చింది.టీజర్ ఆద్యంతం భావోద్వేగభరితంగా, ఉత్కంఠగా సాగింది. బ్రిటిష్ పాలనలో ‘అన్నపూర్ణ దేశం’ ఆకలితో అలమటిస్తున్న దృశ్యాలు, గుప్పెడు గింజల కోసం ప్రజలు పడుతున్న కష్టాలు హృదయాలను కదిలించాయి. ఈ క్రమంలో విజయ్ దేవరకొండ ఎంట్రీ, ఆయన చెప్పిన పవర్‌ఫుల్ డైలాగ్ టీజర్‌కే హైలైట్‌గా నిలిచాయి. “సింగనమల బొబ్బిలి రణబాలిరా నీ అక్కా..!! ఆ కొండమీదున్న మా భద్ర మల్లన్న మీద ఆనా.. నేను కాయలి కాస్తుండగా.. ఒక్క మెతుకు కూడా పొలిమేర దాటదు చెబుతున్నా” అంటూ విజయ్ చెప్పిన పవర్ ఫుల్ డైలాగ్ గూస్‌బంప్స్ తెప్పిస్తోంది. ఆయన బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ, పాత్రలో లీనమైన తీరు మునుపటి చిత్రాలకు భిన్నంగా ఉన్నాయి.1854-1878 మధ్య కాలంలో, ముఖ్యంగా 1876-78లో వచ్చిన భయంకరమైన కరవు నేపథ్యంలో ఈ చిత్రం వాస్తవ సంఘటనల స్ఫూర్తితో తెరకెక్కుతున్నట్టు టీజర్ స్పష్టం చేసింది. “సముద్రాలు దాటి వచ్చిన రాకాసులు కరవు రాక్షసులుగా మారితే.. ఆకలితో చనిపోయిన 80 లక్షల మంది ఆవేశాన్ని సమాధి చేయలేరు” వంటి వాక్యాలు కథలోని తీవ్రతను, పోరాట స్ఫూర్తిని తెలియజేస్తున్నాయి. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, టీ-సిరీస్ సమర్పిస్తోంది. విజయ్ దేవరకొండకు జోడీగా రష్మిక మందన్న నటిస్తుండగా, హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ క్రూరమైన ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. భారీ సెట్లు, యాక్షన్ ఘట్టాలు, నేపథ్య సంగీతం సినిమా స్థాయిని పెంచాయి. ఈ చిత్రాన్ని దసరా కానుకగా అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్టు నిర్మాతలు ప్రకటించారు. టీజర్‌తోనే సినిమాపై భారీ హైప్ క్రియేట్ అవడంతో, విజయ్ కెరీర్‌లో ‘రణబాలి’ ఒక మైలురాయిగా నిలుస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2023/85680, Cell No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com